

*Shilpa Shetty*

తొంభైల్లో సాగరకన్యగా ప్రేక్షకులను అలరించిన శిల్పాశెట్టి కెరీర్‌కు కామా పెట్టినా... అడపాదడపా లైమ్‌లైట్‌లో కనిపిస్తూనే ఉంటుంది. బాలీవుడ్‌లో తనకంటూ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న ఈ పొడుగుకాళ్ల సుందరి ఇప్పుడు 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' వెబ్‌సిరీస్‌తో ఓటీటీ ప్రేక్షకులను పలకరించింది. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్‌సిరీస్‌పై మిశ్రమ స్పందన వ్యక్తం అవుతున్నా.. శిల్ప ఆగమనంపై మాత్రం ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజుల గ్యాప్ తర్వాత శిల్ప పంచుకున్న కబుర్లు ఆమె మాటల్లోనే..

## పిల్లలకు అడ్డు చెప్పను!

**సినిమా** ఇండస్ట్రీ నేను కోరుకున్న దానికన్నా చాలా ఎక్కువ ఇచ్చింది. నేను ఈరోజు ఇలా ఉన్నానంటే అందుకు కారణం సినిమా పరిశ్రమే! ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా అభిమానులు ఎంతగానో ఆదరిస్తుంటారు. నటులకు ఇంతకన్నా అదృష్టం ఏముంటుంది? మా పిల్లలు వియాన్, సమీషాకు ఇవేం తెలియకుండా పెంచాలని అనుకోవడం లేదు. వాళ్లు పెద్దయ్యాక ఒకవేళ సినిమాల్లోకి రావాలని అనుకుంటే.. నేను అడ్డు చెప్పను. పైగా, ప్రోత్సహిస్తాను. అలాగని వాళ్లకు నచ్చకపోతే.. సినిమాల్లో పని చేయాలని ఒత్తిడి చేయను.

**నటిగా** ఎంత సంతృప్తి పొందానో.. అమ్మగా అంతకు రెట్టింపు ఆనందాన్ని అనుభవిస్తున్నాను. తల్లిగా నా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నాననే భావిస్తున్నాను. మా అమ్మానాన్న నాకు ఎంత ప్రేమ పంచారో.. నా పిల్లలకు అంత అవ్వాలని అనుకుంటూ ఉంటాను. నేను, మా ఆయన రాజ్.. ఇద్దరం మిడిల్ క్లాస్ ఫ్యామిలీ నేపథ్యం ఉన్నవాళ్లమే! డబ్బు విలువ మాకు బాగా తెలుసు. అందుకే, ఇప్పుడు ఎంత సంపద ఉన్నా.. వాళ్లను గొప్పింటి బిడ్డల్లా గారాబంగా పెంచాలనుకోవడం లేదు. మిడిల్‌క్లాస్ వాల్యూస్ తెలిసేలా జాగ్రత్తగా పేరెంటింగ్ చేస్తున్నాం. ఈ విషయంలో మా ఇద్దరి మాటా ఒకటే!






## మళ్లీ ఆ ఇద్దరు..

**బాలీవుడ్** నటుడు మనోజ్ బాజ్‌పాయ్, దర్శకుడు నీరజ్ పాండే మళ్లీ జట్టుకడుతున్నారు. మనోజ్‌ను డిఫరెంట్‌గా చూపించడంలో నీరజ్‌కు మంచి రికార్డు ఉంది. పదేండ్ల కిందట వచ్చిన 'స్పెషల్ 26', ఐదేండ్ల క్రితం విడుదలైన 'అయ్యారీ' సినిమాలు వీరి కాంబోలో వచ్చినవే! 'స్పెషల్ 26'లో అక్షయ్ కుమార్ హీరోగా నటించినా.. మనోజ్ బాజ్‌పాయ్ పాత్ర ఇప్పటికీ గుర్తుండిపోయేలా తీర్చిదిద్దారు నీరజ్. ఆ తర్వాత వచ్చిన 'అయ్యారీ' వీళ్ల జోడీ కలిస్తే అద్భుతం ఆవిష్కృతం అవుతుందని నిరూపించింది. మళ్లీ ఐదేండ్ల గ్యాప్ తర్వాత ఈ జంట ప్రాజెక్టు పట్టాలెక్కబోతున్నది. ఇప్పటికే స్క్రిప్ట్ పనిలో ఉన్న నీరజ్ ఇటీవల మనోజ్‌ను కలవడం బీ టౌన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. 'ఒకవైపు సినిమాలు, మరోవైపు ఓటీటీ సిరీస్‌తో మనోజ్ చాలా బిజీగా ఉంటున్నాడు. ఇన్నాళ్లకు సమయం కుదిరింది. త్వరలోనే ఓ మంచి ప్రాజెక్టు చేపట్టబోతున్నామ'ని నీరజ్ ప్రకటించాడు. దీంతో మనోజ్ అభిమానులు ఈ చిత్రం ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



*Mollywood Movies...*



మంచి సినిమా అంటే... గొప్ప కథ దొరకాలి. పాత్రలకు తగ్గ నటీనటులు కుదరాలి. కామెడీ నవ్వించాలి. ఫైట్స్ అబ్బో అనిపించాలి. పాటలు ఇరగదీయాలి. క్లైమాక్స్ అదిరిపోవాలి. ఇలా.. రొటీన్‌కు భిన్నం అంటూనే మూసధోరణిలో వస్తున్న సినిమాలు ఎన్నో! వసూళ్ల పరంగా కోట్లు కొల్లగొట్టినా.. చూసినంత సేపయినా వాటి గురించి మాట్లాడుకోవడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సందేశాత్మక సినిమాల సంగతి దాదాపు మర్చిపోయిన టాలీవుడ్ ప్రయోగాత్మక చిత్రాల దరిదాపుల్లోకి కూడా వెళ్లే సాహసం చేయడం లేదు. ఈ విషయంలో మలయాళ చిత్రసీమ ఆది నుంచీ ముందంజలో ఉంది. కథే ప్రధాన హీరోగా తెరకెక్కుతున్న కొన్ని మలయాళ చిత్రాలు మాలీవుడ్ కథన కుతూహలాన్ని నిరూపిస్తున్నాయి..

# మాలీవుడ్.. కథన కుతూహలం

**మలయాళం** సులభంగా అర్థం కాదు. ఆ భాష లిపి కూడా కాస్త గందరగోళంగానే అనిపిస్తుంది. ఓటీటీ పుణ్యమా అని మాలీవుడ్ పొరుగింటంత దగ్గరైంది. అక్కడ తెరకెక్కిన సినిమాలు.. ఓటీటీ ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరవుతున్నాయి. కొన్ని డబ్బింగ్ వెర్షన్లుగా పలకరిస్తే.. మరికొన్ని మాతృకలో విడుదలైనా అలరిస్తున్నాయి. భాష బుర్రకెక్కకున్నా.. భావం మనసును హత్తుకుంటున్నది. స్టార్‌డమ్ హీరోలు లేకున్నా ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి ఈ చిత్రాలు. కమర్షియల్ హంగులైన ఈ సినిమాల్లో నటించడానికి మాలీవుడ్ పెద్ద హీరోలు ఎలా ఒప్పుకొన్నారా అని ఆశ్చర్యం కలిగిస్తుంది. కథతో రచయితలు, కథనంతో దర్శకులు చేస్తున్న ప్రయోగాలకు కేరళ మాత్రమే కాదు.. దక్షిణాది అంతా ఫిదా అవుతున్నది.

**ఇటీవల** ఓటీటీలో పలకరించిన కొన్ని మలయాళ చిత్రాలు చూస్తే.. కథనంపై వారు సాగిస్తున్న స్వారీ ఆశ్చర్యం కలిగిస్తున్నది. బడా హీరోలను సైతం కథకు అనుగుణంగానే తప్ప.. అనవసరమైన ఎలివేషన్లకు తావులేకుండా డైరెక్ట్ చేస్తున్నారు. 2000 సంవత్సరానికి ముందుకు వెళ్తే.. మలయాళంలోనూ కమర్షియల్ ఫార్ములా చిత్రాలే ఎక్కువగా కనిపించేవి. అగ్రహీరోలు మమ్ముట్టి, మోహన్‌లాల్, సురేశ్ గోపి సినిమాలు కమర్షియల్ పంథాలోనే సాగేవి. ఆ తర్వాత జనరేషన్ దర్శకులు కథకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. ఫలితంగా మాలీవుడ్ కొత్త తరహా చిత్రాలకు వేదికగా మారిందని సినీ విమర్శకులు చెబుతున్నారు. కథ బాగుందంటే ఆ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. రోమాంచమ్, సీయూ సూన్, కుంబలంగి నైట్స్, నెయ్‌మూర్, కాథల్, సాల్ట్ అండ్ పెప్పర్ తదితర చిత్రాలు కథ, కథనాలతో ప్రేక్షకులను అలరించి భారీ విజయాలు సొంతం చేసుకున్నాయి.

**టాలీవుడ్‌లో** మెగాస్టార్‌కు ఉన్నంత క్రేజ్ మాలీవుడ్‌లో మమ్ముట్టికి ఉంది. కమర్షియల్ హీరోగా దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్నారు. అడపాదడపా ప్రయోగాత్మక చిత్రాల్లో మెరిసే ఆయన ఇటీవల వరుసగా రొటీన్‌కు భిన్నమైన సినిమాలతో పలకరిస్తున్నారు. 'నాన్‌పకల్ నేరత్తు మయక్కమ్', 'కన్నూరు స్క్వాడ్', 'కాథల్', 'క్రిస్టఫర్', 'సీబీఐ 5', 'వన్' తదితర సినిమాలు మలయాళంలో సూపర్ హిట్ సాధించాయి. వీటి తెలుగు వెర్షన్లు ఓటీటీలో విడుదలై అక్కడ రికార్డు స్ట్రీమింగ్ సొంతం చేసుకున్నాయి. 'కన్నూరు స్క్వాడ్' చిత్రంలో మమ్ముట్టి పోలీస్ అధికారిగా కనిపిస్తారు. ఓ నేర పరిశోధన కోసం హీరో బృందం ఉత్తరాదికి వెళ్తుంది. అక్కడ వాళ్లకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయన్నది కథ. ఈ తరహా కథలో హీరోయిజాన్ని పండించడానికి ఎన్నో యాక్షన్ సన్నివేశాలను కల్పించే అవకాశం ఉంది. కానీ, ఆ చిత్ర దర్శకుడు వర్గీస్ రాజ్ మాత్రం కథనే నమ్ముకున్నాడు. యాక్షన్ సీక్వెన్స్ కూడా సహజత్వానికి దగ్గరగా తీసి మెప్పించాడు. అందుకే, ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను సొంతం చేసుకుంది. ఓటీటీలోనూ అంతే ఆదరణ పొందింది. మమ్ముట్టి, జ్యోతిక నటించిన 'కాథల్– ద కోర్' ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. సున్నితమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు లభిస్తున్నాయి. 72 ఏండ్ల మమ్ముట్టి కెరీర్‌లో ఎప్పుడూ లేనంత జోరుగా ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తున్నాడంటే.. ఆయనలోని నటుణ్ని మరింతగా ఆవిష్కరించే కథలతో దర్శకులు సంప్రదిస్తుండటమే కారణం!

**ఇటీవల** ఓటీటీలో 'ఫ్యాలిమీ' అనే సినిమా విపరీతంగా స్ట్రీమింగ్ అయింది. ఈ సినిమాలో హీరో అంటూ ప్రత్యేకంగా ఎవరూ లేరు. నితీశ్ సహదేవ్ దర్శకత్వంలో వచ్చిన 'ఫ్యాలిమీ' సాదాసీదా చిత్రం. మిస్టరీలు లేకున్నా... ఆకట్టుకుంటుంది. ఓ కుటుంబం కాశీయాత్రకు వెళ్లాలని నిశ్చయించుకుంటుంది. ఒకరితో ఒకరికి పొసగని ఆ కుటుంబ సభ్యుల కాశీ ప్రయాణం ఎలా సాగింది? అక్కడేం జరిగింది? ఈ యాత్ర వాళ్ల కుటుంబంలో ఎలాంటి మార్పు తెచ్చిందన్నదే కథ. మలయాళ సినిమాలు కాస్త నిదానంగా సాగుతాయన్న పేరుంది. అయితే, ఒకసారి ఆ సినిమాతో కనెక్ట్ అయ్యాక.. అది నిదానంగా సాగినా, పరుగులు తీసినా ప్రేక్షకుడి మెప్పు పొందుతుంది అనడానికి 'ఫ్యాలిమీ' మంచి ఉదాహరణ. సస్పెన్స్ కథకు కామెడీ జోడించి తీసిన 'రోమాంచమ్' సూపర్ హిట్ సాధించింది.

**మలయాళంలో** 2011లో 'ట్రాఫిక్' సినిమా రిలీజైంది. పన్నెండేండ్ల కిందట విడుదలైన ఈ సినిమా ఇప్పటికీ ఓటీటీలో ఆదరణ పొందుతుండటం విశేషం. ఇందులో పకడ్బందీ స్క్రీన్‌ప్లే కనిపిస్తుంది. ఒకే కథలో నలుగురి నేపథ్యాలను పరిచయం చేసి, అనుకోకుండా ముడిపెట్టి ఊహకందని విధంగా తిప్పారు దర్శకుడు రాజేశ్ పిళ్లై. ఉత్కంఠభరితంగా సాగే సినిమాల్లో యాక్షన్ ఎపిసోడ్లు అంతగా లేకున్నా... రోమాలు నిక్కబొడిచే సీక్వెన్సులు కొల్లలుగా కనిపిస్తాయి. ఇటీవల మాలీవుడ్‌లో తనదైన శైలిలో దూసుకుపోతున్న హీరో ఫహద్ ఫాజిల్. తన నటనతో ఆల్ ఇండియా వాంటెడ్ నటుడు అనిపించుకున్నాడు. ఆయన ఎప్పుడో నటించిన సినిమాలు సైతం ఓటీటీలో ప్రత్యక్షమవుతున్నాయి. ఫాజిల్ దొంగ పాత్రలో నటించిన 'తొండిముతలమ్ దక్షిక్షియం' ఓటీటీలో సూపర్ హిట్ అయింది. సినిమా అంతా దొంగ, బాధితులు, పోలీస్ స్టేషన్ వీటి చుట్టూ తిరుగుతుంది. ఓటీటీలో 'దొంగాట'గా వచ్చిన తెలుగు వెర్షన్ కరోనా సమయంలో రికార్డు స్ట్రీమింగ్ సొంతం చేసుకుంది. కమర్షియల్ పంథాకు అందని 'కుంబలంగి ఫైల్స్', 'ధూమం' తదితర సినిమాలు మాలీవుడ్ టేకింగ్ స్టయిల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశాయి.



**తెలుగులోనూ** అడపాదడపా ఈ తరహా కథన ప్రధాన చిత్రాలు పలకరిస్తున్నాయి. భావోద్వేగాల కన్నా సస్పెన్స్, కామెడీ జానర్‌లోనే ఇవి ఉంటున్నాయి. పెద్ద హీరోలకు వచ్చేసరికి మాత్రం.. కమర్షియల్ ఈక్వేషన్‌కు తగ్గేదే లేదంటున్నారు దర్శకనిర్మాతలు. ఓపెనింగ్స్ అదిరిపోతున్నా, రికార్డులు బద్దలవుతున్నా.. తెలుగు సినిమా మాత్రం కొత్తదనాన్ని అందుకోలేకపోతున్నది. పాన్ ఇండియాకు కేంద్రంగా మారుతున్నా.. పసందైన పర్‌ఫెక్ట్ చిత్రాన్ని ప్రేక్షకులకు అందివ్వలేకపోతున్నది. గండ్రగొడ్డలి చేతపెట్టి వరుసపెట్టి కుత్తుకలు తెగ్గొట్టించాలనే దర్శకుల ఆలోచన మారితే కదా.. ఫీల్ గుడ్ సినిమాలు పుడతాయి. అనామక పాత్రతో కూడా అనవసరమైన పంచ్ డైలాగ్ పలికించే దర్శకుల మైండ్‌సెట్ మారనంత వరకు తెలుగు సినిమా దారి మారదని పెదవి విరుస్తున్నారు సగటు ప్రేక్షకులు.

ఓటీటీ హిట్

## మంచు గుప్పిట ప్రాణాలు

### సొసైటీ ఆఫ్ స్నో (స్పానిష్)

**నెట్‌ఫ్లిక్స్:** డిసెంబర్ 31
**నటీనటులు:** ఏంజో ఓగ్రిన్సిక్, మాటియాస్ రికాట్, అగస్టీన్ పర్డెల్లా తదితరులు
**దర్శకత్వం:** జె.ఎ.బయోనా

కొన్నిసార్లు వాస్తవ గాథలు కల్పిత కథల కన్నా గొప్పగా ఉంటాయి. భయానకంగా సాగుతాయి. దానికి కాస్త నాటకీయత జోడించి సినిమాగా మలిస్తే అద్భుతం ఆవిష్కృతం అవుతుంది. అలాంటి సినిమానే 'సొసైటీ ఆఫ్ స్నో'. 1972లో ఉరుగ్వే రగ్బీ జట్టు ఎదుర్కొన్న ఓ ఘోర ప్రమాదం ఆధారంగా ఇది తెరకెక్కింది. ప్రస్తుతం ఓటీటీలో ప్రభంజనం సృష్టిస్తున్నది. కథలోకి వెళ్తే.. ఓ రగ్బీ టీమ్ టోర్నమెంట్ కోసం ఉరుగ్వే రగ్బీ జట్టు చిలీలోని శాంటియాగోకు విమానంలో బయల్దేరుతుంది. ఆటగాళ్లు, వారి కుటుంబసభ్యులు, ఐదుగురు విమాన సిబ్బంది మొత్తంగా 45 మంది ప్రయాణంలో ఉంటారు. విమానం ఆండీస్ పర్వతాలపై ప్రయాణిస్తుండగా మంచు తుఫాను కారణంగా అది కూలిపోతుంది. ఆ ప్రమాదంలో కొందరు



అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోతారు. మరికొందరు గాయాలతో బయటపడతారు. చుట్టూ మంచు పర్వతాలు, మైనస్ 20 డిగ్రీల చలి వెన్నులో వణుకుపుట్టిస్తుంది. తినడానికి ఆహారం దొరకని పరిస్థితి. గాయాలతో బయటపడిన వాళ్లు కూడా చలిని తట్టుకోలేక పూటకొకరు మరణిస్తుంటారు. మిగిలిన కొందరు తమను ఎవరైనా కాపాడలేకపోతారా అని క్షణాలు యుగాల్లా గడిపేస్తుంటారు. 'పది రోజులు అన్వేషించినా ఉరుగ్వే విమాన జాడలు తెలియరాలేదని, సెర్చ్ ఆపరేషన్ నిలిపివేస్తున్నామ'న్న ప్రకటన రేడియోలో వినడంతో ప్రయాణికుల ఆశలు పూర్తిగా ఆవిరవుతాయి. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ప్రాణాలతో బయటపడలేమని అందరూ భావిస్తారు. అయినా, పట్టుదలతో రోజులు గడుపుతుంటారు. ఏదైనా లోయ ప్రాంతానికి చేరుకుంటే సాయం దొరకొచ్చని భావించి బృందంలోని ఓ ఇద్దరు కొండల్లో ప్రయాణిస్తూ ఉంటారు. వాళ్లు గమ్యం చేరుకున్నారా? తాము బతికే ఉన్నామని ప్రపంచానికి తెలియజేశారా? మంచు గుప్పిట చిక్కుకున్న వాళ్లలో ఎంతమంది ప్రాణాలతో బయటపడ్డారు? అన్నది మిగిలిన కథ. హృద్యంగా తెరకెక్కిన ఈ సినిమాలో.. కొన్ని సన్నివేశాలు గుండెను పిండేస్తాయి. ప్రాణాలు నిలుపుకోవడానికి వాళ్లు చేసిన ప్రయత్నాలు ఉత్కంఠ రేపుతాయి. తెలుగు డబ్బింగ్ వెర్షన్ అందుబాటులో ఉంది. చూడదగ్గ సినిమా!



## ఊరంతా.. యూట్యూబ్ వింత!

**పల్లె** అనగానే వ్యవసాయం గుర్తొస్తుంది. పాడి పరిశ్రమకు ఆలవాలం అనిపిస్తుంది. కులవృత్తులకు కేరాఫ్‌గా కనిపిస్తుంది. ఏ పల్లెకైనా కాస్త అటూ ఇటూగా ఈ సూత్రం వర్తిస్తుందేమో కానీ, ఛత్తీస్‌గఢ్‌లోని తుల్సీ గ్రామానికి మాత్రం ఈ ఫార్ములా నప్పదు. ఆ ఊరంతా ఫ్రీ వైఫై జోన్‌ను మరిపిస్తుంది. ఇంటికో యూట్యూబ్ యాక్టర్, వీధికో యూట్యూబర్ కనిపిస్తాడు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు సమీపంలో ఉంటుంది తుల్సీ గ్రామం. సుమారు వెయ్యి గడపలు ఉంటాయి. జనాభా నాలుగు వేల దాకా ఉండొచ్చు. వీరిలో ఓ వెయ్యిమంది వరకు యూట్యూబ్‌కు బలంగా కనెక్టయ్యారు. కొందరు నటులుగా, కొందరు స్క్రిప్ట్ రైటర్లుగా, మరికొందరు వీడియోగ్రాఫర్లుగా ఇలా ఎవరికి వాళ్లు తమ సత్తా చాటడానికి ఉవ్విళ్లూరుతుంటారు. తుల్సీ వేదికగా దాదాపు 40 యూట్యూబ్ చానెళ్లు యాక్టివ్‌గా ఉంటున్నాయి. పల్లె వాతావరణం, డిఫరెంట్ స్లాంగ్‌లో వాళ్లు పండించే సీరియస్ కామెడీకి వీక్షకులు ఫిదా అవుతున్నారు. కుటుంబ కలహాలు, స్నేహితుల కబుర్లు, గల్లీ రౌడీల బిల్డప్‌లు సబ్జెక్టులుగా యూట్యూబ్ రీల్స్, చిట్టి చిత్రాలు నిర్మిస్తున్నారు. సహజత్వానికి దగ్గరగా ఉండటంతో ఈ వీడియోలకు లెక్కకు మించిన లైక్‌లు వస్తున్నాయి. గ్రామానికి చెందిన 'ఛత్తీస్‌గఢీ కామెడీ' యూట్యూబ్ చానెల్‌కు దాదాపు లక్షన్నరమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ చానెల్‌లో 250కి పైగా వీడియోలు అప్‌లోడ్ చేశారు. అన్నీ సూపర్ వ్యూస్ సాధించినవే! వీరిలో కొందరు యూట్యూబర్లు నెలకు రూ.20వేల నుంచి రూ.40వేల వరకు సంపాదిస్తుండటం విశేషం. మొత్తంగా ఊరంతా యూట్యూబ్‌కు వంత పాడుతుండటం వింతేగా!